సాక్షి అనకాపల్లి

సోమవారం । 16 । సెప్టెంబర్ । 2024



కానరాని కాడెడ్లు

వ్యవసాయ పనుల్లో రైతులకు అండగా ఉండే కాడెడ్లు నానాటికీ గ్రామాల నుంచి కనుమరుగవుతున్నాయి. 8లో



కోరలు చాస్తున్న బాహు'బలి

బాహుబలి జలపాతంలా ప్రాచుర్యం పొందిన సరియా జలపాతం పేరుకు తగ్గట్టుగా సందర్శకులను బలితీసుకుంటోంది. 8లో



పెద్దేరుకు జలకళ

మాడుగుల: మండలంలో పెద్దేరు జలాశయానికి జలకళ నెలకొంది.120 క్యూసెక్కులు ఆయకట్టుకు విడుదల చేస్తున్నారు.

మంత్రి వ్యాఖ్యలు సిగ్గుచేటు



గత టీడీపీ ప్రభుత్వంలో ఒక్క మెడికల్ కళాశాల కూడా మంజూరు చేయించక పోగా, విద్యను ప్రైవేటు కార్పొరేట్ వ్యక్తులకు ధారాదత్తం చేశారు. జగనన్న ప్రభుత్వంలో కొత్తగా 15 మెడికల్ కళాశాలలు మంజూరు చేసి భవనాలు నిర్మిస్తుంటే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని సక్రమంగా నిర్వహించాల్సింది పోయి ప్రొఫెసర్లు లేరు.. భవనాలు లేవు.. ఎవరు బోధిస్తారు... అంటూ మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యానించడం అవగాహనారాహిత్యం.. చాలా సిగ్గుచేటు. పేద విద్యార్థులు మెడిసిన్ చదవకూడదన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు. –రాజేష్‌ఖన్నా, ప్రైవేటు లెక్చరర్, పాయకరావుపేట



నక్కపల్లి

విద్యార్థుల ఆశలపై నీళ్లు



నీట్ రాసిన విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లుతున్నారు. మా అమ్మాయి బైపీసీ చదువుతోంది. నీట్ రాయడానికి ప్రిపేర్ అవుతోంది. మెడిసిన్ చదివించాలన్న ఆలోచన ఉంది. జగనన్న కొత్తగా మెడికల్ కళాశాలలు మంజూరు చేయడంతో మా ఆశలు చిగురించాయి. కానీ మా ఆశలపై ఈ ప్రభుత్వం నీళ్లు చల్లేసింది. కూటమి ప్రభుత్వ లక్ష్యం ఒకటే, గత ప్రభుత్వానికి మంచిపేరు రాకూడదు. దీని కోసం ఎంతమందినైనా బలి చేయడమే పనిగా పెట్టుకుంది. గత ప్రభుత్వం 15 మెడికల్ కాలేజీలను మంజూరు చేయించి అనుమతులు తీసుకు వచ్చి సొంత భవనాలు నిర్మిస్తుంటే కూటమి ప్రభుత్వం వీటిని ప్రైవేటుపరం చేయాలని ప్రయత్నించడం సిగ్గుచేటు. –సూరాకాసుల గోవిందు, నక్కపల్లి

సుగంధ పుష్పాల అలంకరణలో గణేశుడు



రంగురంగుల పుష్పాలంకరణలో చోడవరం స్వయంభూ గణేశుడు

చోడవరం: స్థానిక స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వెండి, బంగారు, సుగంధ పుష్పాల అలంకరణలో కనువిందుగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. అనంతరం పండిత ఆశీర్వచనం, లడ్డూ వేలం నిర్వహించారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన మూషిక వాహనంపై ఉత్సవ మూర్తులను అధిష్ఠింపజేసి తిరువీధి నిర్వహించారు. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, ట్రస్ట్ బోర్డు కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబశివరావు, దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు..



ఎం.దీపిక, ఎస్పీ

అనకాపల్లి: ఈనెల 16న ఎస్పీ కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్పీ ఎం.దీపిక ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం మిలాద్ ఉన్ నబీ పండగ కావడంతో ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించింది, దీంతో ఎస్పీ కార్యాలయంలో నిర్వహించాల్సిన గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్టు ఆమె తెలిపారు. సెప్టెంబర్ 23న నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం యాథావిధిగా జరుగుతుందన్నారు.

బెంగళూరులో మోటార్ వర్కర్స్ మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న జి.వామనమూర్తి

అనకాపల్లి: ఆల్ ఇండియా మోటార్ వర్కర్స్ 18వ జాతీయ మహాసభలను ఈ నెల 24, 25 తేదీల్లో బెంగళూరులో నిర్వహించనున్నట్టు ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి తెలిపారు. మండలంలో మూలపేటలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన 2023 మోటారు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా డీజిల్, పెట్రోల్ ధరలు ఒకే విధంగా అమలు చేయాలని, జాతీయ రహదారులపై పెట్టిన టోల్‌గేట్ల ఫీజులను నియంత్రించాలన్నారు. జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో డీజిల్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, ఏడాదికి దేశ వ్యాప్తంగా రెండు కోట్ల నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను మోదీ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సభ్యులు కృష్ణ, పల్లా నర్సింగరావు, సూరి అప్పారావు, సీహెచ్.రాము, బి.సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



కశింకోట మండలంలోని ఏఎస్‌పేట గ్రామం. గ్రామానికి చెందిన తంటపురెడ్డి బాబూరావు సన్నకారు రైతు. రెండెకరాల్లో వరి పంట వేశారు. భారీ వర్షాలకు పూర్తిగా నీట మునిగిన పంట కుళ్లిపోతోంది. ఆ గ్రామంలో రైతులందరికీ సుమారు 80 ఎకరాల పంట నీట మునిగింది. నష్టం జరిగి పదిరోజులైనా మండల వ్యవసాయాధికారి ఇప్పటి వరకూ రైతులను సందర్శించలేదు. కనీసం పంటను కాపాడుకోవడానికి వ్యవసాయ సూచనలు కూడా అందించలేదు. అగ్రికల్చరల్ అసిస్టెంట్ మాత్రమే వచ్చారని, పంట నష్టం పరిహారం అందుతుందో లేదో కూడా తెలియదని ఆ రైతు చెబుతున్నారు. పంట మునిగిన బాధకు తోడు అధికారుల నిర్లక్ష్యం ఇక్కడి అన్నదాతలను మరింత బాధిస్తోంది.



కశింకోట మండలం నూతలగుంటపాలెం గ్రామంలో నీట మునిగి పాడై పోయిన వరి పంట

ఈ కన్నీరు కనబడలేదా..!

భారీవర్షాలకు జిల్లాలో 6 వేల ఎకరాల్లో నీట మునిగిన పంట

- 5,500 ఎకరాల్లో వరి, 500 ఎకరాల్లో ఇతర పంటలకు దెబ్బ
- కానీ అధికారులకు కనిపించేది 3 వేల ఎకరాలేనట!
- 'సాక్షి' క్షేత్ర స్థాయి సందర్శనలో కన్నీళ్లు పెట్టుకున్న రైతులు
- శనివారం నాటికి 2 వేల ఎకరాల్లో పూర్తిగా కుళ్లిపోయిన పంట
- వర్షాలకు అస్తవ్యస్తంగా మారిన చోడవరం-నర్సీపట్నం రోడ్డు



వాసం నాగేశ్వరరావుది పాయికరావుపేట మండలం, గుంటపల్లి గ్రామం. ఒక సన్నకారు రైతు. సొంతంగా రెండెకరాలు, కౌలుకు మరో 6 ఎకరాలు తీసుకుని వరి సాగు చేశారు. వర్షాలకు పంట పూర్తిగా నీట మునిగిపోయింది. వేల రూపాయిలు పెట్టుబడి పెట్టిన పంట కళ్లముందే కుళ్లిపోతోంది. దానిని కాపాడుకోవాలంటే మరింత పెట్టుబడి కావాలి. అధికారులెవరూ ఇప్పటి వరకూ స్పందించలేదు. కనీసం పంట నష్టం అంచనా కూడా వేయలేదు. పంటను కాపాడుకోవడం ఎలా...పంట నష్టపోతే పరిహారమైనా దక్కుతుందా...అంటూ ఆవేదనలో మునిగిపోయాడు.



అనకాపల్లి నియోజకవర్గంలో..

850 ఎకరాల పంట నష్టం

మొత్తం 850 ఎకరాలు పంట నష్టం జరిగింది. అనకాపల్లి మండల పరిధిలో ముంపునకు గురైన ఆవఖండం, శంకరం పంచాయతీ, రేబాక, మార్టురు, సీహెచ్ఎన్ అగ్రహారం, బౌవులవాడ, తుమ్మపాల, దిబ్బపాలెం, ఊడేరు గ్రామాలను 'సాక్షి' సందర్శించగా అక్కడ 650 ఎకరాలు పంట నీట మునిగిన వైనం కనబడింది. రైతులతో మాట్లాడితే అధికారులు వచ్చారు..గానీ పంటనష్టం ఎంత రాశారో...ఎంత ఇస్తున్నారో స్పష్టంగా చెప్పలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కశింకోట మండలంలో నీట మునిగిన ప్రాంతాలైన ఏఎస్ పేట, నూకలగుంటపాలెం, ఏనుగుతుని, కొత్తపల్లి, ఉగ్గినపాలెం, గొబ్బూరు, వెదురుపర్తి, నర్సింగిపల్లి, అచ్యుతాపురం గ్రామాలకు వెళ్లి రైతులతో మాట్లాడడం జరిగింది. కశింకోట మండలం పరిధిలో 200 ఎకరాల్లో ముంపునకు గురైంది.



బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఈ నెల 7వ తేదీ అర్ధరాత్రి నుంచి 10వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షాలు కురిశాయి. జిల్లాలో ఉన్న తాండవ, పెద్దేరు, కోనాం, కళ్యాణపు లోవ రిజర్వాయర్లు గరిష్ట నీటిమట్టానికి చేరడంతో గేట్లు ఎత్తివేయడంతో నదులు, వాగులు, చెరువులు నిండి, పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. తాజాగా 'సాక్షి' బృందం ఫీల్డ్ విజిట్‌లో రైతుల కన్నీటి దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 1,13,520 ఎకరాల్లో వరి సాగు వేశారు. వీటిలో 5,500 ఎకరాల వరి నీట మునిగింది.



నక్కపల్లి మండలం గొడిచెర్లలో ఇంకా నీటిలోనే వరి పంట



యలమంచిలి మండలంలో పూర్తిగా దెబ్బతిన్న వరి పంట



కశింకోట మండలం ఏఎస్ పేటలో నీట మునిగి పూర్తిగా పాడైన వరి పంట

సాక్షి, అనకాపల్లి: నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురవడంతో జిల్లా వ్యాప్తంగా సుమారుగా 6 వేల ఎకరాల్లో పంట నీట మునిగింది. వీటిలో 5,500 ఎకరాల్లో వరి, 500 ఎకరాల్లో ఇతర పంటలు(కూరగాయలు, చెరకు, ఉద్యానవన) ముంపునకు గురైంది. మునిగిన పంట 6 ఎకరాల వరకూ ఉంటే, అధికారులు మాత్రం 1,528 హెక్టార్ల (3,200 ఎకరాల)వరి పంట మాత్రమే నీట మునిగినట్టు చెబుతున్నారు. రైతులంతా మునిగిన పంటను కూడా నష్టం లేదంటూ రాస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల పంట మునిగిన నాలుగు రోజుల వరకూ కూడా అధికారులు రాలేదని, మరికొన్ని చోట్ల ఆర్‌బీకేలో ఉన్న అగ్రి అసిస్టెంట్లు వచ్చి రాసుకుని పోయారు గానీ నష్ట పరిహారం వస్తుందా..? లేదా కూడా చెప్పలేని పరిస్థితిలో ఉన్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. నీట మునిగిన 6 వేల ఎకరాల్లో నీరు బయటకు తీసిన తరువాత కొంత మేర పంట గట్టెక్కే పరిస్థితి ఉన్నా, సుమారు 2 వేల ఎకరాల్లో మాత్రం పంట కుళ్లిపోయింది. ఎండకు ఎర్రగా ఎండిపోయే పరిస్థితిలో ఉంది. మిగతా అన్ని చోట్ల నీరు బయటకు పోవడం, ఎండ ఎక్కువగా ఉండడంతో రికవరీ అయినట్లుగా అనిపించింది.

నష్టం కుదించే ప్రయత్నం చేస్తున్నారు...

భారీ వర్షాల కారణంగా పంట మునిగినా..నష్టం లేదంటూ కుదించే ప్రయత్నాలు అధికారులు చేస్తున్నారు. నాలుగు రోజుల పాటు ఎడతెరిపిలేకుండా భారీగా వర్షాలు కురిశాయి. అధికారులు వర్షాలు తగ్గిన రెండు రోజుల తరువాత పంట నష్టం చూడడానికి వెళ్లారు. అప్పటికే రైతులు తమ పంటను కాపాడుకోవడానికి గట్లుకు గండి కొట్టి దిగువ ప్రాంతాలకు నీరు పోయేట్లు చేసుకున్నారు. కానీ అప్పటికే పంట దెబ్బతింది. అయితే మడిలో నీరు లేకపోవడం చూసిన అధికారులు మీకు ఎటువంటి నష్టం లేదంటూ వెళ్లిపోయారంటూ రైతులు కన్నీళ్లు పెట్టుకున్నారు. రైతుకు 6 ఎకరాలు పంట నీట మునిగితే అందులో 3 ఎకరాలే రాసుకుని వెళ్లిపోతున్నారంటూ 'సాక్షి' ఫీల్డ్ విజిట్‌లో రైతులు కన్నీరు మున్నీరు అయ్యారు.



పాయకరావుపేట మండలం గోపాలపట్నం ఆవలో నీట మునిగిన వరి పంట



అనకాపల్లి మండలం శంకరం గ్రామంలో నీట మునిగిన వరి పంట

రహదారులు ఛిద్రం

గతంలో దెబ్బతిన్న కొన్ని రహదారులకు మరమ్మతులు చేశారు. అవి ఈ వర్షాలకు కొంతమేర దెబ్బతిన్నాయి. నర్సీపట్నం–చోడవరం రోడ్డు మొత్తం అస్తవ్యస్తంగా మారింది. గుంతల్లో రోడ్డున్నట్టుగా బురదమయింగా మారింది. ప్రయాణికులు, వాహనచోదకులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు.



నర్సీపట్నం-చోడవరం రోడ్డు దుస్థితి

నష్టం ఇదీ...సాయం ఏదీ..!

జిల్లాలోని పాయకరావుపేట నియోజకవర్గంలో 2 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. పాయకరావుపేట మండలం గుంటపల్లి, నామవరం, గోపాలపట్నం, మంగవరం, అరట్లకోట, పి.ఎల్ పురం గ్రామాల పరిధిలో వెయ్యి ఎకరాల్లో, నక్కపల్లి మండలం గొడిచెర్ల, ఉద్దండపురం, ఒడ్డిమెట్ట, జగన్నాథపురం, రమణయ్యపేట, చినదొడిగల్లు, దేవవరం,కాగిత, వేంపాడు పరిధిలో 500 ఎకరాల్లో, ఎస్.రాయవరం మండలంలో పెనుగొల్లు, ధర్మవరం, చినగుమ్మలూరు, పెదగుమ్మలూ రు, పెద ఉప్పలం, పేట సూదిపురం,శెట్టిగోయపల్లి, రామయ్యపట్నం గ్రామాల పరిధిలో 400 ఎకరాల్లో నష్టం జరిగింది. కోటవురట్లలో రాంచంద్రాపురం, కందూరు, జల్లూరు, పాములవాక, కె.వెంకటాపురం, ఆక్సాహేబ్‌పేటలో 100 ఎకరాల్లో నష్టం జరిగింది.

నర్సీపట్నం నియోజకవర్గం: వెయ్యి ఎకరాలు పంట మునిగింది. నాతవరం 500 ఎకరాల్లో, నర్సీపట్నం మండల పరిధిలో వెములుపూడి, జోగినాయుడుపాలెం,బలిఘట్టం,పెదబొడ్డిపల్లి పరిధిలో 300 ఎకరాలు, గొలుగొండ మండల పరిధిలో పాత మల్లంపేట, చోద్యం, గాదంపాలెం, మల్లంపేట, లింగంపేట గ్రామాల పరిధిలో 100 ఎకరాలు, మాకవరపుపాలెం మండల పరిధిలో 100 ఎకరాల్లో పంటనష్టం జరిగింది.

చోడవరం నియోజకవర్గం

ఐదొందల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. చోడవరం పరిధిలో లక్ష్మీపురం, కస్పా, ముద్దుర్తి, పీఎస్‌పేట, చాకిపల్లి, బెన్నవోలు, గౌరీపట్నం కస్పా,, కందిపల్లి గ్రామాల పరిధిలో 250 ఎకరాలు, బుచ్చియ్యపేట మండలంలో వడ్డాది కస్పా, రాజాం, బంగారుమెట్ట, లోపూడి గ్రామాల పరిధిలో 150 ఎకరాలు, రావికమతం మండల పరిధిలో దొండపూడి, టి.అర్జాపురం, మేడివాడ, కొత్తకోట, తోటకూరపాలెం పరిధిలో 50 ఎకరాలు, రోలుగుంట మండలం అడ్డసరం గ్రామాల పరిధిలో 50 ఎకరాల పంట నష్టం వాటిల్లింది.

మాడుగుల నియోజకవర్గం: 250 ఎకరాల్లో పంట నీట మునిగింది. మాడుగుల మండలంలో 100 ఎకరాలు, చీడికాడ పరిధిలో కొండగెడ్డ, పసుపుగెడ్డ, బొడ్డేరు పొంగిపొర్లడంతో పరివాహపు ప్రాంతాల్లో 150 ఎకరాల్లో పంట ముంపునకు గురైంది.

యలమంచిలి నియోజకవర్గం: మొత్తం 900 ఎకరాల్లో పంట ముంపునకు గురైంది. యలమంచిలి మండలంలో 350 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. రాంబిల్లి మండలం పరిధిలో రజాల, మురకాడ, మర్రిపాలెం, కొత్తబోలు, దిమిలి, పంచదార్ల, కొత్తూరు గ్రామాల్లో 300 ఎకరాల్లో వరి, మునగపాక మండల పరిధిలో 250 ఎకరాల్లో పంట మంపునకు గురైంది.

ఉన్న ఎకరం మునిగిపోయింది



ఈ ఏడాది ఒక ఎకరంలోనే వరి వేశాను. ఉన్న ఒక ఎకరం వరి పంట మునిగిపోవడంతో ఈ ఏడాది కుటుంబం గడిచేదెలాగో తెలియడం లేదు. మూడు రోజుల పాటు వరద నీటితో పంట మునిగిపోయి ఉంది. వెంటనే గట్లకు గండి కొట్టి నీరు తీశాను. అయినా కుళ్లిపోయింది. పంట పూర్తిగా పోయినట్లే. ఉన్న పంట తీసేసి మళ్లీ వరినాట్లు వేసుకోవాలి. ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తే..కుళ్లిన చోట వరినాట్లు వేస్తాను. – గొర్లి శ్రీనివాసరావు, కశింకోట

జియో ట్యాగింగ్ లేదట..



పంట మునిగిపోయి మేం బాధపడితే, అగ్రిఅసిస్టెంట్, ఏవో వచ్చి జియోట్యాగింగ్ అయిన తరువాత పంట నష్టం రాస్తామని చెబుతున్నారు. నేను 3 ఎకరాల వరి పంట వేస్తే రెండెకరాలు మునిగింది. జియోట్యాగింగ్ అవ్వలేదంటున్నారు. నాకేమీఅర్థం కావట్లేదు.. నష్టం రాయలేదు.. పరిహారం ఇవ్వలేదు. ఇస్తారో లేదో కూడా తెలియదు. –తంటపురెడ్డి చిరంజీవి, ఏఎస్ పేట, కశింకోట మండలం

నక్కపల్లిలోనే గ్రీవెన్స్ నిర్వహించాలి

రైతులు, నాయకుల స్పష్టీకరణ

నక్కపల్లి: విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతుల సమస్యలు పరిష్కరానికి నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలోనే గ్రీవెన్స్ నిర్వహించాలని బాధిత రైతులు, వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ నేత కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, తదితరులు విలేకర్లతో మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరించకుండా పరిహారం పూర్తిగా చెల్లించకుండా పోలీసుల బందోబస్తు నడుమ ఏపీఐఐసీ వారు చేపట్టిన పనులను అడ్డుకోవడం జరిగిందన్నారు. తామంతా ఆందోళన చేయడంతో రైతులతో చర్చలు ఏర్పాటు చేస్తామని, వారి సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారని, అప్పటి వరకు పనులు తాత్కాలికంగా నిలిపివేస్తామని ప్రకటించారన్నారు. ఈనెల17న కలెక్టర్, హోం మంత్రి సమక్షంలో సమస్యల పరిష్కారానికి సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఇప్పుడు మాట మార్చారన్నారు. 17వ తేదీ మంగళవారం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన విడుదల చేసారని, రైతులంతా అక్కడకు రావాలని కోరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వందలాది మంది రైతులంతా 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న అనకాపల్లి వచ్చే పరిస్థితి లేదన్నారు. స్థానికంగా ఉన్న నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఈ సమావేశం ఏర్పాటు చేయాలని, బహిరంగ సమావేశం నిర్వహిస్తే రైతులంతా తమకు జరిగిన అన్యాయం, రావాల్సిన నష్టపరిహారం గురించి విన్నవించుకోవడం జరుగుతుందన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని వాయిదా వేసి మరో రోజు నక్కపల్లిలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి నిర్వాసితులెవరూ హాజరయ్యే పరిస్థితి లేదన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సర్పంచ్ తళ్ల భార్గవ్, ఎంపీటీసీ గంటాతిరుపతిరావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సూరాకాసుల గోవిందు, మాజీ సర్పంచ్ తళ్ల అప్పలస్వామి, సీపీఎం మండల కన్వీనర్ మనబాల రాజేష్, వంకా కృష్ణ, పలువురు రైతు నాయకులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న నాయకులు

ఏపీ వ్యవసాయ సేవా సంఘం ఉమ్మడి విశాఖ నూతన కార్యవర్గం



ఎన్నిక ఉత్తర్వులు అందుకుంటున్న నూతన పాలకవర్గ సభ్యులు

సబ్బవరం: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సేవా సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా ఎన్నికలు విశాఖలోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సీనియర్ సహాయకునిగా పనిచేస్తున్న ఎస్.క్రాంతికుమార్‌ను అధ్యక్షుడిగా, ఎల్.మోహన్‌రావును కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎస్.వెంకటేశ్వరరావు, సహాయ ఎన్నికల అధికారిగా వెన్న రమేష్, ఎన్నికల పరిశీలకునిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.పాపారావు వ్యవహరించారు. ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు ఉత్తర్వులు అందించారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులతోపాటు మిగిలిన పాలకవర్గ సభ్యులను ఉమ్మడి వ్యవసాయ శాఖ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు పీవీ సాయికుమార్, ప్రధాన కార్యదర్శి ఎ.రవికుమార్, కార్యదర్శి వి.కొండబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెజ్ భూముల పరిహారంపై టీడీపీ మాయమాటలు

- ఆర్లి మాజీ సర్పంచ్ బోళెం కృష్ణారావు



కె.కోటపాడు: స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఎస్ఈజెడ్) ఏర్పాటుకు మండలంలో ఆర్లితోపాటు పరిసర గ్రామాల్లో భూముల అనుకూలతపై సాధ్యాసాధ్యాల పరిశీలనకు మాత్రమే కలెక్టర్ విజయకృష్ణన్ ఇటీవల వచ్చారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఆర్లి మాజీ సర్పంచ్ బోళెం కృష్ణారావు తెలిపారు. ఎస్ఈజెడ్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాకుండానే స్థానిక గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు రైతులను మాయమాటలతో నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సెజ్ ఏర్పాటు కోసం రైతుల నుంచి సేకరించనున్న భూమికి ఎక్కువ పరిహారం మంజూరు చేయిస్తామని మభ్యపెడుతున్నారని, వాటిని నమ్మవద్దన్నారు. ఇదే అవకాశంగా చేసుకుని ఈ ప్రాంతంలో డి-ఫారం భూములకు రైతుల పేరున పట్టాలను జారీ చేయిస్తామంటూ వసూళ్ల దందాకు తెరతీశారన్నారు. ఇంకా సెజ్ ఏర్పాటుకు ఎటువంటి అనుమతులు రాలేదని, రైతులు ఎవ్వరూ వారి మాటలతో మోసపోవద్దని కోరారు.

ఒప్పంద కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలి

- ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు రమణ



నిరసన తెలుపుతున్న ఏరియా ఆస్పత్రి ఒప్పంద కార్మికులు

నర్సీపట్నం: వైద్య విభాగంలో పని చేస్తున్న ఒప్పంద కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద ఒప్పంద కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. వేతనాలు అందక దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని వాపోయారు. ఒప్పంద కార్మికులకు సంబంధించి కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్‌లో కలపాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొన్ని చోట్ల రాజకీయ వేధింపులు పెరిగాయన్నారు. పెండింగ్ వేతనాలను చెల్లించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పెదపూడి సత్యవతి, సోమేశ్వరరావు, పార్వతి, దుర్గా, లక్ష్మీ, రాము, పద్మ, మల్లేశ్వరి, కమల, వరలక్ష్మి, లావణ్య, దేవి పాల్గొన్నారు.

విద్యార్థుల ఉసురు పోసుకోవద్దు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వైద్య కళాశాలల నిర్మాణం జరగలేదని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి తప్పించుకునే ధోరణిలో మాట్లాడడం విడ్డూరంగా ఉంది. కళాశాలల్లో రెండో ఏడాది విద్యార్థులకు తరగతులు జరగడం లేదని.. మాజీ సీఎం జగన్‌పై విష ప్రచారాలు చేయడమే మంత్రులు ప్రధాన పనిగా పెట్టుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మెడికల్ కళాశాలలు మూత పడేలా చేస్తే.. పేద విద్యార్థుల పరిస్థితి దారుణంగా తయారవుతుంది. వారి ఉసురు పోసుకోవద్దు. **– పాత్రపిల్లి సునీల్‌కుమార్, జ్ఞానాపురం**



ర్యాంకు వచ్చినా సీటు రాలేదు




నేను నీట్ రాశాను. ర్యాంకు వచ్చినా రాష్ట్రంలో మెడికల్ సీట్లు తక్కువగా ఉండటంతో సీటు రాలేదు. అందుకే లాంగ్ టెర్మ్ కోచింగ్ తీసుకుంటున్నా. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉంటే సీట్ల సంఖ్య పెరుగుతుంది. తద్వారా ఎక్కువ మంది ఎంబీబీఎస్ చదివే అవకాశం ఉంటుంది. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలో నీట్‌కు చాలా ఎక్కువ పోటీ ఉంటుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు ఇచ్చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుంది. ఎంతో కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రుల కలలు నెరవేరేలా ప్రభుత్వం మేలు చేయాలి. అన్యాయం చేయకూడదు. **– ఎస్ కార్తీక్,** పెద్దగదిలి

కానరాని కాడెడ్లు

- భారంగా మారిన పశుపోషణ
- వ్యవసాయంలో పెరుగుతున్న యాంత్రీకరణ
- వీటితో తక్కువ ఖర్చు, సమయం ఆదా
- ఇతర పనులకు పోతున్న కూలీలు

వ్యవసాయ పనుల్లో రైతులకు అండగా ఉండే కాడెడ్లు జిల్లాలో కనుమరుగవుతున్నాయి. పెరుగుతున్న యాంత్రీకరణ, మారిన జీవన విధానంతో పశుపోషణ భారంగా మారడంతో కాడెడ్ల వినియోగం తగ్గింది. గతంలో పండించిన పంట ఉత్పత్తులను తరలించేందుకు, బంధువుల ఇళ్లకు, శుభకార్యాలకు వెళ్లాలంటే ఎడ్లబండ్లపైనే ప్రయాణం చేసేవారు. ప్రస్తుత పరిస్థితి అందుకు పూర్తిగా భిన్నంగా మారిపోయింది.



కబేళాకు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్న పశువులు



ట్రాక్టర్‌తో పొలం దుక్కి దున్నుతున్న దృశ్యం

రాంబిల్లి (యలమంచిలి): గతంలో గ్రామాల్లో వ్యవసాయం చేసే ప్రతి రైతు ఇంటి ఆవరణలో ఎడ్లబండి, పాలాల్లో పశువులు పాక ఉండేవి. ఎడ్ల బండి ఉన్న రైతులకు దుక్కులు దున్నడం పంటచేను, చెరకు, బెల్లం తరలించడం, ఇలా రోజు వారీగా సంవత్సరం అంతా వ్యవసాయ పనులు ఉండేవి. రైతులంతా ఆరోగ్యంగా ఆనందంగా జీవనం సాగించేవారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు సైతం పొలం పనుల్లో నిమగ్నమయ్యేవారు. ప్రస్తుతం వాటి స్థానంలో యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ట్రాక్టర్‌తో పాటు వివిధ రకాల కోత మిషన్లు, రోటావేటర్, ట్రిగ్గర్ వంటి వాటిని అందజేస్తోంది. వీటిని తక్కువ పెట్టుబడితో వాయిదాల రూపంలో బ్యాంకులు వంటి సంస్థలు అందించడంతో రైతులు ఎద్దులతో వ్యవసాయానికి స్వస్తి పలుకుతున్నారు. గతంలో విత్తు నుంచి పంటలో కలుపు మొక్కలను తొలగించడం, మందులు పిచికారీ చేయడం, పంటను తొలగించే పనులు కేవలం మనుషుల ద్వారానే చేసేవారు. ఇప్పుడు ఇవన్నీ అనేక రకాల పరికరాలను ట్రాక్టర్లకు అమర్చుకుని ఒకరిద్దరితోనే చేసుకుంటున్నారు. యాంత్రీకరణ వల్ల వ్యవసాయ కూలీలకు ఉపాధి కరువైంది.

గత వైఎస్సార్‌సీపీ హయాంలో సబ్సిడీపై యంత్రాలు

ప్రస్తుతం యంత్రాల వాడకంలో భాగంగా రైతు ఎకరా పొలం దున్ని దమ్ము పట్టాలంటే రోజంతా కష్టపడాలి. రూ.6 వేల వరకు ఖర్చవుతుంది. ట్రాక్టర్‌తో దున్నడం వల్ల సమయం వృథా కాకుండా సకాలంలో పూర్తవడం రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఖర్చవుతుంది. యంత్రాలు ద్వారా పని సులువుగా వేగంగా జరిగిపోవడంతో దుక్కు దున్నే రైతన్న అవసరం లేకుండా పోతుంది. చిన్న చిన్న కమతాలు సేద్యం చేసే రైతులే కాడెడ్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయ రంగానికి అధిక పీట వేయాలనే లక్ష్యంతో గ్రామ సచివాలయాల పరిధిలో పది మందితో ఒక కమిటీగా ఏర్పాటు చేసి సబ్సిడీపై యంత్రాలు అందించేది. రాంబిల్లి మండలంలో 9 గ్రామ సచివాలయాలకు యంత్రాలు అందించారు.

పంటల్లో రసాయన అవశేషాలు

గ్రామాల్లో రైతులు వ్యవసాయం చేసేందుకు ఎడ్లను పాడి సంపద కోసం పశువులను పెంచి పోషించుకొనేవారు. వాటి ద్వారా వచ్చే పేడ గోమూత్రాన్ని ఎరువుగా మార్చుకొని పొలాలకు వాడేవారు. వీటి దారి పండించిన పంటల ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉండేవారు. నేడు విత్తనాలను నిల్వ చేసుకోవడం నుంచి పంటను సాగు చేసి ఇంటికి చేర్చే వరకు రసాయన ఎరువుల వాడకం పెరిగింది. ప్రస్తుతం పశువుల ద్వారా వ్యవసాయం చేసేవారు కనుమరుగవుతున్నారు. మారుమూల గ్రామాల్లో సైతం వ్యవసాయానికి వాడే ఎద్దులు, కర్రనాగళ్లు, పలుగు, పారలు లేకపోగా, యంత్రాల ద్వారానే సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుత పంటల్లో రసాయన అవశేషాలు ఉంటున్నాయి. వాటిని తింటున్న ప్రజలు రకరకాల రోగాల బారిన పడుతున్నారు. నేడు సేంద్రియ పద్ధతి ద్వారా పండించిన పంటలకు డిమాండ్ పెరిగింది.

సంప్రదాయ పనిముట్లతో పంటల దిగుబడి

ట్రాక్టర్లతో దుక్కులు దున్నడం వల్ల సక్రమంగా పంటలు పండటం లేదు. ట్రాక్టర్లు, ట్రిగ్గర్లు ద్వారా దుమ్ములు సరిగ్గా రావడం లేదు. గతంలో కర్రనాగలిని ఉపయోగించి ఎడ్లతో నాలుగైదు సార్లు ఎనుమాటుకు దున్నడం వల్ల నేల సారవంతంగా తయారయ్యేది. భూమి లోతుగా సాల్లు పెరిగి, వాటి ద్వారా పంట కుదుళ్లతో బలంగా ఉండి త్వరగా నేలకొరిగేది కాదు. పంటల దిగుబడి బాగుండేది.

– పల్లా సతీష్, రైతు, వెంకటాపురం, రాంబిల్లి మండలం

వ్యవసాయ పనులు లేక ఇతర పనులకు



ఒకప్పుడు మేము ఎద్దులతో దుక్కులు దున్ని దమ్ములు పట్టేవాళ్లం. పొలం గట్లును పటిష్ట పరచడానికి పలుగు, పారలు ఉపయోగించి చేసేవాళ్లం. ఇప్పుడు వాటిని కూడా యంత్రాలతో చేస్తున్నారు. వరి పంట కోతలు, కలుపు తీత, సేంద్రియ ఎరువులు చల్లడానికి, నూర్పులు నూర్చడానికి.. ఇప్పుడు అన్నింటికి యంత్రాలు ఉపయోగిస్తున్నారు. వ్యవసాయ పనులు లేక ఇతర భవన నిర్మాణ పనులకు వెళ్లాల్సి వస్తోంది.

– బీరా శ్రీను, రైతు, యలమంచిలి

పశుపోషణ కరువైంది



ఒకప్పుడు సేద్యం చేయాలంటే పశువులు తప్పనిసరిగా ఉండేవి. ఇప్పుడు ఎవరూ చేయడానికి ఆసక్తి చూపడం లేదు. దాంతో భూములను రియల్ ఎస్టేట్‌గా మార్చేస్తున్నారు. దాంతో పశుగ్రాసం కొరత వస్తోంది. అందువల్ల పశువులను పెంచడం మానేశారు.

– మళ్ల రమణబాబు, రైతు, నర్సింగబిల్లి, కశింకోట మండలం

యాంత్రీకరణ వైపు రైతుల మొగ్గు

ప్రస్తుతం వ్యవసాయంలో తక్కువ ఖర్చు, సమయం ఆదా కోసం రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మండలంలో ఎక్కువ మంది రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు, ట్రిగ్గర్లు, వరి నూర్పు యంత్రాలను అందజేశాం. గ్రామ సచివాలయాల పరిధిలో రైతులతో ఒక కమిటీ వేసి వారికి సబ్సిడీపై వీటిని అందించాం. రాంబిల్లి మండలంలో 9 కమిటీలకు యంత్రాలు అందించాం. ప్రస్తుత ప్రభుత్వంలో యంత్రాల అందజేతపై ఇంకా ఎటువంటి ఆదేశాలు రాలేదు.

– సి.సమంత, మండల వ్యవసాయాధికారి, రాంబిల్లి

సనాతన ధర్మం వల్లే దైవ క్షేత్రాలు

- ఆధ్యాత్మిక వేత్త సామవేదం షణ్ముఖశర్మ



ప్రవచనం ఆలకిస్తున్న భక్తజనం



సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనం

అనకాపల్లి: సరస్వతి కృప లేకపోతే బుద్ధిహీనులు అయిపోతారని, ఋషులు తపస్సు చేయడం వల్ల తపఃశక్తి వచ్చిందని ఆధ్యాత్మిక వేత్త సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డులో కన్యకాపరమేశ్వరి ఆలయ శతజయంతి వేడుకల్లో భాగంగా రెండో రోజు ఆదివారం పరమేశ్వరి త్రిశక్తి ప్రవచనాలపై ఆయన అనుగ్రహ భాషణం చేశారు. దేవతలు రావడం వల్ల దైవశక్తి వస్తుందన్నారు. రెండు శక్తులు కలిస్తే క్షేత్రం వ్యాసమహర్షి సరస్వతీ దేవి అనుగ్రహంతో వేదాంత గ్రంథాలు రక్షించగలిగాయన్నారు. ఆలయాలు ఉన్నా లేకపోయినా క్షేత్రంలో భగవంతుని శక్తి మాత్రం ఉంటుందన్నారు. సనాతన ధర్మం వల్లే దైవక్షేత్రాలు ఏర్పడ్డాయన్నారు. ఆదిశంకరాచార్య 126 సంవత్సరాలు జీవించి పిల్లలందరికీ భారతదేశం సనాతన ధర్మాలు తెలియపరచారన్నారు. విద్యార్థులందరికీ వేదాలు, పురాణాలు తల్లిదండ్రులు నేర్పించాలని కోరారు. సోమవారం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకూ ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో శతజయంతి ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీదరాల సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్ ఉద్యోగి ఆత్మహత్య



వాసా నవీన్‌కుమార్(ఫైల్)

మునగపాక: మండలంలోని కాకరాపల్లిలో హెచ్‌పీసీఎల్ ఉద్యోగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. కాకరాపల్లికి చెందిన వాసా నూకరాజుకు ఇద్దరు కుమారులు. వారిలో చిన్న కుమారుడు నవీన్‌కుమార్(24) ఇంజినీరింగ్ పూర్తి చేసి హెచ్‌పీసీఎల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. 13న డ్యూటీ కోసం ఇంటి నుంచి బయలు దేరిన ఆయన రాత్రి ఇంటికి రాకపోయే సరికి ఆందోళనకు గురైన తల్లిదండ్రులు బంధువులు, స్నేహితులను వాకబు చేసినా ఫలితం లేకపోయింది. అయితే అదే గ్రామంలోని నూకరాజుకు చెందిన పాత ఇంట్లోకి ఆదివారం వెళ్లి చూడగా.. నవీన్‌కుమార్ ఉరిపోసుకుని విగతజీవిగా కనిపించాడు. మృతుడి సోదరుడు సతీష్ ఫిర్యాదు మేరకు మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. కుటుంబానికి దన్నుగా నిలుస్తాడనుకుంటున్న నవీన్ ఆత్మహత్యకు పాల్పడడాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.

యువకుడి అదృశ్యం.. కాలువలో గాలింపు



బుజ్జి కోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు

మునగపాక: మండలంలోని అరబుపాలెం ఇటుకబట్టీలో పని చేస్తున్న ఓ యువకుడు అదృశ్యమైన ఘటనపై మునగపాక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. బుచ్చెయ్యపేట మండలం ఉప్పరగూడెం గ్రామానికి చెందిన గుత్తల బుజ్జి(24) కొన్నేళ్లుగా మునగపాక మండలం అరబుపాలెంలోని ఇటుక బట్టీల్లో పని చేస్తున్నాడు. శనివారం ఉదయం పనికి వెళ్లిన బుజ్జి రాత్రి ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికారు. అయినా ఫలితం లేకపోయింది. అయితే ఇటుక బట్టీ సమీపంలో సాగునీటి కాలువలో పడిపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ ఆదివారం బుజ్జి సోదరుడు ప్రేమ్‌కుమార్ మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో యువకుడు అదృశ్యం కింద కేసు నమోదు చేసిన ఎస్ఐ ప్రసాదరావు.. గజ ఈతగాళ్లను రప్పించి కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. బుజ్జి ఆచూకీ మాత్రం లభించలేదు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

నర్సీపట్నం: భార్యపై కత్తితో దాడి చేసి గాయపరిచిన భర్తపై కేసు నమోదు చేశామని టౌన్ ఎస్సై ఉమామహేశ్వరరావు ఆదివారం తెలిపారు. మున్సిపాలిటీ వెలమవీధిలో నివాసం ఉంటున్న కె.వి.గణేశ్వరరావు ఈ నెల 14వ తేదీ రాత్రి భార్య సత్యవతిపై కత్తితో దాడి చేయడంతో ఆమె గాయపడిందన్నారు. వీరిద్దరికి 20 ఏళ్ల క్రితం వివాహమైందని, తరచూ గొడవలు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో భార్యపై భర్త కత్తితో దాడి చేశాడన్నారు. బాధితురాలి తల్లి బి.రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

ఫార్మా బాధితులకు అండగా జగనన్న

- క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం
- బాధిత కుటుంబాలకు అందజేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



గాయపడిన దిగుమర్తి అప్పారావుకి రూ.లక్ష చెక్కు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



క్షతగాత్రుడు పరమేశ్వరరావుకు రూ.లక్ష చెక్కు ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



మునగపాక : యామినికి రూ.లక్ష చెక్కు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



వెంకటాపురంలో రాజారావుకు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

యలమంచిలి రూరల్: అచ్యుతాపురం సెజ్ ఎసైన్షియా ఫార్మా పరిశ్రమలో గత నెల 21న జరిగిన ప్రమాదంలో గాయపడిన యలమంచిలి పట్టణానికి చెందిన ఇద్దరు బాధితులకు వైఎస్సార్‌సీపీ ఆర్థికంగా అండగా నిలిచింది. గతంలో బాధితులను పరామర్శించినపుడు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రూ.లక్ష చొప్పున సాయాన్ని ఆదివారం స్థానిక పార్టీ నేతలు బాధితులకు అందజేశారు. ఫార్మా పరిశ్రమ ప్రమాదంలో మృతులు, క్షతగాత్రుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున పార్టీ తరఫున సాయంగా ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రమాదంలో గాయపడిన యలమంచిలి యాతపేటకు చెందిన దిగుమర్తి అప్పారావు, ఫైర్‌ఆఫీస్ కాలనీకి చెందిన పరమేశ్వరావులకు రూ.లక్ష సాయానికి సంబంధించిన చెక్కులను పార్టీ నాయకులు ఆదివారం సాయంత్రం వారి నివాస గృహాలకు వెళ్లి అందజేశారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా మాజీ సీఎం జగన్ ఎప్పుడూ ప్రజాపక్షమేనని, మాట ఇస్తే హామీని తప్పకుండా నెరవేర్చుతారని పార్టీ నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న క్షతగాత్రులు అప్పారావు, పరమేశ్వరావులతో పాటు వారి కుటుంబీకులు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిఅయజేశారు. యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు ఎర్రయ్యదొర, యలమంచిలి మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వర్రావు,వార్డు కౌన్సిలర్లు ఈరిగిల గణేష్, సుంకర మరిణేశ్వర్రావు, దూది నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు పిల్లా త్రినాథ్, అంకిరెడ్డి నర్సింగరావు,గొంపాని అప్పారావు,గిర్లి వెంకట్,జోజిబాబు, బొత్స అప్పారావు, కొత్తలంక చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడ్డ యామినికి చెక్కు అందజేత

మునగపాక : ఫార్మా బాధితులను ఆదుకుంటామని ఇచ్చిన హామీని అమలు చేసిన ఘనత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. అచ్యుతాపురంలోని ఎసైన్షియా ఫార్మా కంపెనీలో గత నెల 21న జరిగిన ప్రమాదంలో మండలంలోని ఉమ్మలాడకు చెందిన శరగడం యామిని గాయాలపాలైన సంగతి తెలిసిందే. దీంతో ఆదివారం జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా అందిన రూ.లక్ష చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఫార్మా ప్రమాదం బాధాకరమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పాలకులు చూడాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఫార్మా బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో మేలు జరిగిందన్నారు. పార్టీ తరఫున రూ.లక్ష అందజేసి బాధితులకు అండగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు,పార్టీ నేతలు సూరిశెట్టి రాము,మొల్లేటి శంకర్,సూరిశెట్టి శ్రీనివాసరావు, విజయకుమార్, దొడ్డి వరహా, మందా రాము, మొల్లేటి నాయుడు పాల్గొన్నారు.

రాంబిల్లి(యలమంచిలి) : ఫార్మా బాధితులను వైఎస్సార్‌సీపీ కష్టకాలంలో ఆదుకుంటుందని రాంబిల్లి మండలం జెడ్పీటీసీ ధూళి నాగరాజు, ఎంపీపీ గొట్టుముక్కల శిరీష భర్త వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనుబాబు అన్నారు. ఇటీవల ఎస్ఈజెడ్ ఎసైన్షియా ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో గాయాలపాలైన వారిని ఆదుకోవడానికి వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి రూ.లక్ష చొప్పున అందజేస్తామని ప్రకటించారు. ఈ మేరకు నాయకులు ఆదివారం రాంబిల్లి మండలంలో ఆరుగురు క్షతగాత్రులు నేతల అప్పారావు (నేవీ కాలనీ), బద్ది సూరిబాబు (వైలోవ), గజ్జి రాజారావు (వెంకటాపురం), రాయి సత్యనారాయణ (ధారపాలెం), చందక అప్పారావు (పంచదార్ల), భూపతి శివ వెంకటరత్నం (పెదకలవలాపల్లి)లను పరామర్శించి, రూ.లక్ష చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నీరుకొండ వెంకట సూర్యనారాయణ, ధూళి సూర్యచంద్ర, ధూళి రమణ, బద్ది ఆనంద్, నారాయణరావు, తాతబ్బాయి, ఉప్పులూరి నాయుడు, అప్పలకృష్ణ, కనకారావు, ముసిలిరావు పాల్గొన్నారు.

కోరలు చాస్తున్న బాహుబలి

- జలపాతంలో గల్లంతైన ఇద్దరి మృతదేహాలు లభ్యం
- శ్రమించి బయటకు తీసిన ఎన్డీఆర్ఎఫ్, నేవీ బృందాలు
- పోస్టుమార్టంకు తరలింపు



వాగు నుంచి తరలిస్తున్న దిలీప్‌కుమార్ మృతదేహం

అనంతగిరి (అరకులోయ రూరల్): సెలవు వేళ సరదాగా గడిపేందుకు కుటుంబసభ్యులు, స్నేహితులతో జలపాతం వద్దకు వచ్చిన ఇద్దరు ఊహించని పరిస్థితుల్లో ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు. దీంతో విహారం కాస్త విషాదంగా మారింది. మండలంలోని జీనబాబు పంచాయతీలోని సరియా (బాహుబలి) జలపాతంలో శనివారం సందర్శనకు వచ్చిన లంక సాయికుమార్ (33), దిలీప్‌కుమార్ (31) గల్లంతవడం తెలిసిందే. వీరిద్దరు మృతదేహాలను జలపాతం లోంచి ఆదివారం ఎస్డీఆర్ఎఫ్, నేవీ బృందాలు, స్థానికులు బయటకు తీశారు.

దైవక్షేత్రాల సందర్శనకు ఒకరు.. సహోద్యోగితో కలిసి మరొకరు..

విజయనగరం జిల్లా బాబామెట్టకు చెందిన లంక సాయికుమార్ పైడి భీమవరంలోని సర్కా మెడికల్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. బీహార్‌లోని బడితిపూర్‌మలాహి గ్రామానికి చెందిన దిలీప్‌కుమార్ విశాఖలోని నేవీలో సీనియర్ సెయిలర్‌గా పనిచేస్తున్నారు. ఈనేపథ్యంలో సాయికుమార్ ముగ్గురు స్నేహితులతో కలిసి విశాఖలోని దైవ క్షేత్రాలను సందర్శించారు. అక్కడి నుంచి శనివారం నేరుగా సరియా జలపాతం అందాలను తిలకించేందుకు వచ్చారు. ఇక్కడ అందాలు తిలకిస్తుండగా సాయికుమార్ ప్రమాదవశాత్తూ కాలుజారి పడిపోయారు. జలపాతం సందర్శనకు వచ్చిన నేవీ ఉద్యోగి దిలీప్‌కుమార్ తన సహోద్యోగితో కలిసి అతనిని కాపాడేందుకు ప్రయత్నించారు. దీనిలో భాగంగా జలపాతంలోకి వారిద్దరు దూకగా దిలీప్‌కుమార్ గల్లంతయ్యారు. సహోద్యోగి ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు.

అష్టకష్టాలు పడి

జలపాతం ఉధృతంగా ప్రవహించడం వల్ల గల్లంతైన వారిని వెలికితీసేందుకు ఎన్డీఆర్ఎఫ్, నేవీ బృందాలతో పాటు స్థానికులు తీవ్రంగా శ్రమించారు. ఇద్దరి మృతదేహాలను ఊబిలోంచి మధ్యాహ్నం బయటకు తీశారు. అక్కడి నుంచి అటవీప్రాంతం గుండా సుమారు అరకిలోమీటరు పొడవునా మోసుకుని వచ్చి తాళ్లసాయంతో గెడ్డను దాటించారు. పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు అనంతగిరి ఎస్ఐ కరక రాము, దేవరాపల్లి ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాలింపు చర్యలను వీరితోపాటు డిప్యూటీ తహసీల్దార్ మాణిక్యం పర్యవేక్షించారు. ఇలావుండగా ఇప్పటివరకు జలపాతంలో ప్రమాదాలకు గురై 42 మంది ప్రాణాలు కోల్పోయారు.

లక్ష్యాన్ని మించి వరి నాట్లు


కశింకోట వద్ద ఎదుగుదల దశలో ఉన్న వరి పొలాలు


బయ్యవరం వద్ద వేసిన వరి నాట్లు

మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ వరి సీజన్ ముగిసింది. సాధారణంగా ఆగస్టు నెలాఖరుతోనే ఖరీఫ్ సీజన్ ముగుస్తుంది. అయితే మండలంలో మాత్రం సెప్టెంబర్ 15 వరకు వరి నాట్లు నిర్వహించి దాదాపు పూర్తి చేస్తారు. ప్రస్తుతం వరి నాట్లు లక్ష్యాన్ని మించి పూర్తి అయ్యాయి. అదే సమయంలో భారీ వర్షాల వల్ల పలు గ్రామాల్లో వరి నాట్లు దెబ్బతిని నష్టం వాటిల్లింది.

- రైతులను గట్టెక్కించిన వర్షాలు
- సంతృప్తికరంగా ఖరీఫ్ వరి సీజన్

కశింకోట : మండల గ్రామాల్లో పండించే పంటల్లో ఖరీఫ్ వరి అధికంగా సాగు చేస్తారు. కశింకోట, బయ్యవరం, వెదురుపర్తి, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, తేగాడ, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, జమాదులపాలెం, వినన్నపేట, తాళ్లపాలెం, గొబ్బూరు, ఏఎస్ పేట, సోమవరం, నరసింగబిల్లి, చింతలపాలెం, జెట్టపురెడ్డితుని, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, అచ్యుతాపురం, అచ్చెర్ల, జి. భీమవరం, చెరకాం, సుందరయ్యపేట, కన్నూరుపాలెం, తీడ, ఆనందపురం, సింగవరం, మోసయ్యపేట తదితర గ్రామాల్లో వరి ఎక్కువగా సాగు చేస్తారు. ఈ ఏడాది సాధారణ విస్తీర్ణం 909 హెక్టార్లుగా నిర్ణయించారు. మొదట్లో సరైన వర్షాలు లేకపోవడం, తర్వాత వర్షాలకు నారుమళ్లు నీటి ముంపునకు గురై ఎదుగుదల లేకపోవడంతో మందకొడిగా నాట్లు జరిగాయి. దీంతో ఏడాది సాధారణ విస్తీర్ణాన్ని చేరుకోవడం కష్టంగా భావించారు. బోర్లు, బావులు, నీటి సదుపాయం ఉన్న వారు అడపాదడపా నాట్లు వేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షాలతో పాటు అంతకు ముందు అడపాదడపా కురిసిన వర్షాలు రైతులను గట్టెక్కించాయి. గత ఏడాది సరైన వర్షాలు లేక నాట్లు పడని బయ్యవరం వంటి గ్రామాల్లో సైతం ఈసారి నాట్లు వేశారు. మేలు చేసిన వర్షాలే పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో వరి నాట్లను నీటి ముందునకు గురి చేశాయి.దీంతో కశింకోట, వెదురుపర్తి, గొబ్బూరు, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం వద్ద గంగడోలు, కొత్తపల్లి, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, ఎఎస్ పేట తదితర గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో నాట్లు నీటి ముంపునకు గురయ్యాయి. వాటిలో తేరుకోగా 31 హెక్టార్లలో వరి నాట్లు దెబ్బతిని నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించి ఇప్పటికే ఉన్నతాధికారులకు పరిహారం కోసం సిఫార్స్ చేశారు. కొంత నష్టం కలిగించినప్పటికి తుపాను వర్షాలు ఎక్కువ శాతం మేర వరి నాట్లు కావడానికి దోహదపడ్డాయని చెప్పవచ్చు. దీంతో సాధారణ విస్తీర్ణాన్ని అధిగమించాయి. ఖరీఫ్ గడువు ముగిసినప్పటికి ఇంకా అడపా దడపా వరి నాట్లు వేస్తున్నారు. దీంతో విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. ఇకపై వాతావరణం అనుకూలించి సమృద్ధిగా వర్షాలు పడి చీడపీడలు లేకుండా ఉంటే వరి పంట పండి చేతికి అందగలదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విస్తీర్ణం పెరగనుంది..

మండలంలో ఈ ఏడాది సాధారణ విస్తీర్ణాన్ని మించి వరి నాట్లు వేశారు. సాధారణ విస్తీర్ణం 909 హెక్టార్లు కాగా, అంతకంటె ఎక్కువగా నాట్లు పడ్డాయి. ఇంకా అడపా దడపా నాట్లు వేస్తున్నందున ఇంకా విస్తీర్ణం పెరగనుంది. ఇటీవల కురిసిన వర్షాలు వరి నాట్లు పూర్తి కావడానికి ఎక్కువగా దోహదపడ్డాయి. అలాగే పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో 31 హెక్టార్లు నీటి ముంపునకు గురై నష్టం వాటిల్లింది. ఈ మేరకు గుర్తించి పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదించాం.

– ఎం. స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట.

వర్షాలు ఉపకరించాయి..



కశింకోటలోని శారదా నది అవతల ఉన్న సుమారు 70 సెంట్ల భూమిలో వరి నాట్లు వేశాను. ఇటీవల కురిసిన వర్షాలు ఇందుకు బాగా ఉపకరించాయి. వర్షం కురవకపోతే నాట్లు వేసే అవకాశం ఉండదు.

– వేగి కన్న అప్పారావు, రైతు, కశింకోట

గణపతి మండపాల వద్ద అన్నసమారాధనలు


వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నసమారాధన


ఉమ్మలాడ కాలనీలో గణపతిని దర్శించుకుంటున్న సునీత, జానకీరామరాజు తదితరులు


ఉగ్గినపాలెంలో నిర్వహిస్తున్న అన్న సమారాధన

అనకాపల్లి : స్థానిక వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద సోదర సమితి ఆధ్వర్యంలో గణపతికి ప్రత్యేక హోమాలు, పూజలు చేపట్టారు. మధ్యాహ్నం 2500 మంది భారీ అన్నసమారాధన నిర్వహించారు. సోదర సమితి ప్రతినిధులు తాకాశీ వెంకటేశ్వరరావు, ప్రసాద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మలాడ రహదారిలో..

స్థానిక ఆశీలమెట్ట జంక్షన్ ఉమ్మలాడ రోడ్డు కాలనీ శ్రీబాలమిత్ర గౌరీ వినాయక యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు దంపతులు, ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ, పట్టణ సీఐ టి.వి. విజయకుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం వెయ్యి మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాలమరశెట్టి ఓం నమఃశివాయ అండ్ బ్రదర్స్, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బండిగాడి వీధిలో..

స్థానిక బండిగాడి వీధిలో వినాయక నవరాత్రులను పురస్కరించుకుని ప్రముఖ వ్యాపారవేత్త పాలమరశెట్టి మోహనరావు, మళ్ల జగ్గఅప్పారావు (కాయకూరల వ్యాపారి) ఆధ్వర్యంలో నవరాత్రుల సందర్భంగా మధ్యాహ్నం 3 వేల మందికి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండిగాడి వీధి కమిటీ సభ్యులు, వర్తకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


తమలపాకుల అర్చన అందుకున్న సాయినగర్ కాలనీ గణేశుడు


ఉమ్మలాడ కాలనీలో అన్నసమారాధన


గవరపేటలోని పెద్ద వినాయకుని నిమజ్జనోత్సవ ఊరేగింపు

అన్నదానాలు.. నిమజ్జనోత్సవాలు..

కశింకోట : మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగింపునకు చేరడంతో ఆదివారం పలుచోట్ల భారీ అన్న సమారాధనలు, నిమజ్జనోత్సవాలు ఉత్సాహవంతంగా నిర్వహించారు. స్థానిక గవరపేటలో కళ్లాల దిబ్బ, ఆళ్ల వారి వీధి ప్రాంతాలు, ఇక్కడి సాయినగర్‌లో అన్న సమారాధనలు నిర్వహించారు. సాయినగర్ వినాయకుని తమలపాకులతో అర్చించి వివిధ రకాల పిండి వంటలు నివేదించారు. మిల్లెట్లతో వినాయకుని బొమ్మ ఏర్పాటు చేశారు. ఇది భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే ఉగ్గినపాలెంలోని వినాయక ఉత్సవాల్లో భాగంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే గవరపేట మధ్య వీధిలో ఉన్న పెద్ద వినాయకుని గ్రామ వీధుల్లో ఊరేగించి స్థానిక శారదా నదిలో నిమజ్జనం చేశారు. అలాగే భవానీ కాలనీ, వడ్డి వీధిలోని వైఎస్సార్ జగనన్న కాలనీలోని వినాయకుని విగ్రహాలను రిక్షాలపై ఊరేగించి నదిలో నిమజ్జనం చేశారు. ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.


కశింకోట వడ్డి వీధిలో వైఎస్ జగనన్న కాలనీలో నెలకొల్పిన గణేష్ విగ్రహ నిమజ్జనోత్సవ ఊరేగింపు


వేల్పులవీధి మినరల్ వాటర్ ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు


నర్సింగరావుపేట మెహర్‌బాబా వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడు

కిసాన్ మహిళా మిత్ర సేవలు సద్వినియోగం చేసుకోవాలి

అచ్యుతాపురం (మునగపాక): రైతుల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన కిసాన్ మహిళా మిత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ చైర్మన్ సురేష్ కోరారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు, మార్కెటింగ్ వంటి అంశాలపై ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో మడుతూరులో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిసాన్ మహిళా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ద్వారా రైతులకు మేలు జరిగే కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. సంస్థ సీఈవో రాజు మాట్లాడుతూ ఈ నెల 28, 29 తేదీల్లో అనకాపల్లిలో రైతు మేళా జరుగుతుందన్నారు. మోటూరు సంజీవ్, విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షుడు ఆనందరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కిసాన్ మహిళా మిత్ర ఆర్గనైజేషన్ చైర్మన్ సురేష్

ఘనంగా పసలమారమ్మ పండగ


మునగపాకలో పసలమారమ్మ పండగ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాకలో ఆదివారం పసలమారమ్మ పండగ ఘనంగా జరిగింది. సాయంత్రం డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పంచాయతీ సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, పసలమారమ్మ సంఘం సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరద బాధితుల కోసం నిత్యావసర వస్తువుల సేకరణ


విజయవాడ వరద బాధితుల కోసం సేకరించిన నిత్యావసర వస్తువులు

కశింకోట : స్థానిక హౌసింగ్ కాలనీకి చెందిన ముత్యాలమ్మ సేవా సమితి విజయవాడ వరద బాధితులకు బాసటగా నిలిచింది. ఇంటింటికీ తిరిగి 11 క్వింటాళ్ల బియ్యం, వస్త్రాలు, నగదుతో పాటు గోధుమ పిండి, కందిపప్పు, సేమియా, బిస్కెట్లు వగైరా సరకులను 80 కుటుంబాలకు సరిపడే విధంగా ప్యాక్ చేసి వెళ్లి పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ప్రోత్సాహంతో సమితి ప్రతినిధులు నూకాలమ్మ, శిష్టి రాజు, సంతోష్, మంగా రంజిత్, శ్రీనివాస్, వై. దర్శి, రమేష్, అమ్మిశెట్టి లక్ష్మణకుమార్ పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నాట్య ప్రదర్శన


ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన

కశింకోట : స్థానిక అగ్రహారం వీధిలో ఆదివారం రాత్రి ప్రదర్శించిన కూచిపూడి నాట్యం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. వరసిద్ధి వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మారుతి విద్యాపీఠం నిర్వాహకుడు రేజేటి మారుతి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రదర్శించారు. విశాఖలోని భాగవతుల శిరీష బృందం కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించింది.

దైవ చింతన అలవరచుకోవాలి


ఉమ్మలాడలోని గణనాథుడిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరచుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మండలంలోని ఉమ్మలాడలో శ్రీబాలగణపతి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాన్ని ఆయన ఆదివారం దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకాశం ఉన్న వారు తరచూ ఆలయాలను సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు, పార్టీ నేతలు మొల్లేటి శంకర్, సూరిశెట్టి రాము, సూరిశెట్టి శ్రీనివాసరావు, కరోతి విజయకుమార్, ఆడారి కాశీబాబు, మొల్లేటి నాయుడు, మొల్లేటి వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

35..చిన్నకథకాదు	: రాజా
ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్	: సత్యనారాయణ స్క్రీన్-1
మత్తు వదలరా 2	: సత్యనారాయణ స్క్రీన్-2
ఆయ్	: పర్లిసాయి
సరిపోదా శనివారం	: షిర్డీసాయి
ఉత్సవం	: వెంకటేశ్వర
కళింగ	: శ్రీసత్య
భలేఉన్నాడే	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 66 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–10 యూనిట్లు, బీ పాజిటివ్–26 యూనిట్లు, ఓ పాజిటివ్–24 యూనిట్లు, ఏబీ పాటిజివ్–6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 259 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 197 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న దూలం బూసిరాజు

అనకాపల్లి : ఆవ గర్భంలోకి వరద నీరు ప్రవహించే **దారికి అడ్డంగా** ఎటువంటి నిర్మాణాలు జరిపినా **అనకాపల్లి పట్టణా**నికి పెద్ద ఎత్తును నష్టం వాటిల్లే **అవకాశాలు ఉన్నా**యని అనకాపల్లి ఆవఖండ పరిర**క్షణ సమితి కన్వీనర్** దూలం బూసిరాజు అన్నారు. **స్థానిక సీపీఐ కార్యాలయంలో** ఆదివారం జరిగిన **సమావేశంలో** ఆయన మాట్లాడారు. గతంలో **ఆర్నాన్ ఎడిఫైసెస్** ప్రైవేట్ లిమిటెడ్, దాని బినామీ **కంపెనీలు ఆవ**ఖండం భూమి దురాక్రమణకు పాల్పడుతుంటే పెద్ద ఎత్తును ఉద్యమాలు చేసినట్లు తెలిపారు. ఆవఖండంలో భవనాలు నిర్మించినట్లయితే అనకాపల్లి పట్టణం, మండలంలో తుమ్మపాల, శంకరం గ్రామాలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. గతంలో అధికారులు ఆవఖండంలో ఎటువంటి నిర్మాణాలు జరపరాదని ఆదేశాలు జారీ చేయడంతో అవి నిలుపుదల అయ్యాయన్నారు. ప్రస్తుతం ఆవఖండం భూముల్లో అనధికార లే ఔట్లు వేస్తున్న నేపథ్యంలో వాటిపై జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు వచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై ఈనెల 17 నుంచి ఉద్యమం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వై.ఎస్.భద్రం, కనిసెట్టి సురేష్‌బాబు, గాడి బాలు, రాజాన దొరబాబు, శేఖరమంత్రి సాయి లక్ష్మణ్, విత్తనాల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షునిగా మళ్ల


పట్టణ నందమూరి ఫ్యాన్స్ నూతన కమిటీ

అనకాపల్లి : పట్టణ నందమూరి ఫ్యాన్స్ అధ్యక్షునిగా మళ్ల సంతోష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ ఆవరణ శ్రీనాగదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం జరిగిన ఎన్నికల్లో గౌరవాధ్యక్షుడిగా పొలిమేర నాయుడు, కార్యదర్శిగా విల్లూరి అప్పలనాయుడు, కోశాధికారిగా దూలం ప్రసాద్‌తో పాటు 10 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ ఈ కమిటీ రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. పట్టణ పరిధిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు నూతన కమిటితో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మళ్ల గణేష్, కరణం శ్రీను, వెంకట్రావు, శ్రీను, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

అహింసా మార్గంతో సమస్యలు దూరం


ఇంటింటి ప్రచారం చేస్తున్న మహా కరుణ ధర్మ ప్రచార పరిషత్ చైర్మన్ జగపతిరాజు

కశింకోట : ధ్యానం, అహింసా మార్గం పాటిస్తే అన్ని సమస్యల నుంచి బయట పడవచ్చని మహా కరుణ ధర్మ ప్రచార పరిషత్ సమితి చైర్మన్ దాట్ల రాయ జగపతిరాజు అన్నారు. మహా కరుణ యాగంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1200 గ్రామాల్లో నిర్వహించడానికి చేపట్టిన ఇంటింటి ధర్మ ప్రచార పాదయాత్ర ఆదివారం కశింకోటలోని గవరపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరేగింపుగా ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరూ ధ్యానం ఆచరించాలని, మాంసాహారాన్ని త్యజించి శాకాహారాన్ని భుజించాలని కోరారు. ధ్యాన సాధన వల్ల జ్ఞానం అలవడుతుందన్నారు. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్‌ను బ్రహ్మర్షి పత్రీజీ స్థాపించి దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉచిత ధ్యాన శిక్షణ కేంద్రాలు నెలకొల్పి అందరికీ ధ్యాన విద్య అందిస్తున్నారన్నారు. ఆగస్టు 11న అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వద్ద ఉన్న ప్రకృతి వ్యాలీ ధ్యాన శాఖాహార గ్రామం నుంచి ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమానికి విశేష మహిళాదరణ లభించింది.

ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలి


బాబాను దర్శించుకుంటున్న సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

కశింకోట : ప్రతి మనిషి సేవలందించడం పట్ల దృష్టి సారించాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. లక్ష్మణరావు అన్నారు. కశింకోటలోని కోమటి వీధిలో సుమారు రూ.30 లక్షలతో నిర్మించిన సత్యసాయి సేవా కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టు పక్కల ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని, వాటిలో పాల్గొని సేవలందించడమే జీవితానికి సరైన సంతృప్తిని కలిగించే మార్గమన్నారు. ఇదే మార్గాన్ని సత్యసాయి సేవా సంస్థలు అనుసరిస్తున్నాయన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా నాయకుడు దాడి రత్నాకర్, సేవా కేంద్రం కన్వీనర్ ముక్కా అప్పలనాయుడు మాట్లాడారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది. ఎక్కువ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

వేద పాఠశాలలో లక్ష గరిక పూజ


వేద పాఠశాలలో పూజా క్రతువు నిర్వహిస్తున్న పురోహితులు


లక్ష గరికల పూజ అందుకున్న గణనాథుడు

యలమంచిలి రూరల్: పట్టణంలోని గౌడుజోగమాంబ వేద పాఠశాలలో వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం గణపతి హోమం, లక్ష గరిక పూజ నిర్వహించారు. తొలుత యాగశాలలో హోమం చేసిన తర్వాత.. పూజా హాలులో ప్రతిష్ఠించిన మట్టి గణపతికి వేద పండితుడు శ్రీనివాస కులకర్ణే, పురోహితులు భాగవతుల సాయికుమార్, ఆకొండి సాయి శర్మ, కాలనాథభట్ల వెంకటేష్ శర్మ, ఆనివెళ్ల శ్రీనివాస్, వేద విద్యార్థులు లక్ష గరికల పూజా క్రతువును శాస్త్రోక్తంగా జరిపారు. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు సతీ సమేతంగా ఈ క్రతువులో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. గాయత్రీ సేవా ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఆచళ్ల వీరభద్రరావు, పెద్దింటి సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఎం రక్షణ యాత్ర

అచ్యుతాపురం(మునగపాక) : ఫార్మా కార్మికుల భద్రత కోసం సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు చేపట్టనున్న సీపీఎం రక్షణ యాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు అచ్యుతాపురంలో యాత్ర పోస్టర్‌ను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాయకరావుపేట నుంచి పరవాడ వరకు మోటార్ సైకిల్ యాత్ర నిర్వహిస్తామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, కర్రి అప్పారావు, సోము నాయుడు, చేపల తాతయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.